రూ.32కోట్ల కందుల క్రయ విక్రయాలు

తాండూరు, జనవరి19:తాండూరు వ్యవసాయ మార్కెట్‌లో రెండు నెలల్లో 34,350 క్వింటాళ్ల కందుల క్రయవిక్రయాలు జరిగాయి.రూ.32 కోట్ల వ్యాపారం జరిగింది. ఈనెల 5వ తేదీన ఒక్కరోజే 2,995క్వింటాళ్ల క్రయవిక్రయాలు జరిగాయి. గరిష్ఠంగా క్వింటాల్ కందులకురూ.10,059, కనిష్ఠంగా రూ.8800 ధర పలికి బిడ్డింగ్ వ్యాపారం జరుగుతుంది. కందిపప్పును వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. కందుల గిట్టుబాటు ధరలు ఉండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త రేషన్‌కార్డులపై కొరవడిన స్పష్టత!

- గ్యారంటీలకు ప్రామాణికమైతే.. కార్డు వచ్చే వరకు ఆగాల్సిందేనా!
- వికారాబాద్ జిల్లాలో 40వేలకు పైగా దరఖాస్తులు

తాండూరు, జనవరి 19: తెల్లరేషన్ కార్డు లేని అర్హులైన పేదల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఆధార్‌కార్డు ఆధారంగా ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించారు. దారిద్ర్య రేఖకు దిగువ ఉన్న కుటుంబాలకు ఈ పథకాలు అందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశం. ఈ వారంలో ఆరు గ్యారంటీలపై అధికారులు సర్వే చేయాలని నిర్ణయించడంతో దేనిప్రామాణికంగా అర్హులను గుర్తిసారనేదానిపై అయోమయం నెలకొంది. ఏడేళ్లుగా రేషన్‌కార్డుల జారీప్రక్రియ నిలిచిపోయింది. మహాలక్ష్మిపథకం, గృహజ్యోతి, ఉచితవిద్యుత్ , ఇందిరమ్మ ఇళ్లు, యువవికాస్, చేయూత పథకాలను నిరుపేదలకు ప్రభుత్వం దశల వారీగా అందించనుంది. పదేళ్లుగా రేషన్‌కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తులు చేస్తునే ఉన్నారు. ప్రజాపాలన లో కూడా అర్హులు దరఖాస్తులు చేశారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 40వేలకుపైగా రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. కుటుంబాల సంఖ్య పెరుగుతున్నా దానికి అనుగుణంగా కార్డులు జారీ చేయలేదు.



మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ బాలికల హాస్టల్లో నాలుగు నెలలుగా మెస్ బిల్లులు రాక వార్డెన్లకు ఇబ్బందిగా మారింది. నిత్యావసర సరుకులు, కూరగాయలు, చికెన్, గుడ్లు, పండ్లు, గ్యాస్ కొనుగోలుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఎలాగోలా సరుకులు తెచ్చి నిర్దేశిత మెనూ ప్రకారం విద్యార్థినులకు భోజనం పెట్టలేని పరిస్థితి నెలకొంది. కొందరు వార్డెన్లు వడ్డీలకు డబ్బులు తెచ్చి వండి పెడుతున్నారు. మరికొందరు ఉద్దెరకు సరుకులు కొనుగోలు చేస్తున్నారు. మెస్ బకాయిలు రూ.లక్షల్లో పేరుకుపోతున్నాయని, దీంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్నామని వార్డెన్లు, కేర్‌టేకర్స్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు, డిసెంబరు నెలలకు సంబంధించిన మెస్ బిల్లుల కోసం వారు కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్నారు.

చేవెళ్లలోని మోడల్ స్కూల్ హాస్టల్

రూ.లక్షల్లో బిల్లులు పెండింగ్

ఒక్కో మోడల్ హాస్టల్‌లో వంద మంది వరకు ఉంటారు. ఒక విద్యార్థినికి రూ.40.27 చెల్లిస్తున్నారు. ఒక హాస్టల్లో నెలకు రూ.1.90లక్షల వరకు మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. రంగారెడ్డి జిల్లాలో శంకర్‌పల్లి మినహా మిగతా 8 హాస్టళ్లలో సుమారు రూ.60.80 లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వికారాబాద్‌లో సుమారు 45.60లక్షల వరకు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.

మెస్ బిల్లులేవీ!

ఉమ్మడి జిల్లాలో 4 నెలలుగా అందని మెస్‌చార్జీలు

పాత బిల్లులు చెల్లిస్తేనే సరుకులు ఇస్తామంటున్న టెండర్‌దారులు

- అప్పులు చేసి మోడల్ హాస్టల్స్‌ను నెట్టుకొస్తున్న వార్డెన్లు
- చేవెళ్ల మోడల్ స్కూల్ హాస్టల్లో సరుకులు లేక భోజనం బంద్
- హోటల్ నుంచి భోజనం తెచ్చి పెడుతున్న తల్లిదండ్రులు
- ఇంటిబాట పడుతున్న విద్యార్థినులు

వికారాబాద్/మేడ్చల్(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి), జనవరి 19 : రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలో మొత్తం 15 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. మోడల్ స్కూళ్లలో చదువుకుంటున్న ఇంటర్ విద్యార్థినులకు ప్రభుత్వం పక్కనే వసతిగృహాన్ని ఏర్పాటు చేసింది. ఒక్కో మోడల్ హాస్టల్‌లో వందమంది విద్యార్థినులు ఉంటున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, షాబాద్, ఇబ్రహీంపట్నం పరిధి బొంగ్లూరు, శంషాబాద్ మండలం పాల్మాకుల, యాచారం మండలం గున్‌గల్, మహేశ్వరం, మంచాల మండలం ఆరుట్ల, కందుకూరు, శంకర్‌పల్లిలో మోడల్ స్కూల్స్ కొనసాగుతున్నాయి. శంకర్‌పల్లి మినహా అన్ని మండలాల్లో ఇంటర్ విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం కల్పించారు. అలాగే వికారాబాద్ జిల్లాలో పూడూరు మండలం ఎన్కేపల్లి, తాండూరులోని జిన్‌గుర్తి, పరిగిలోని జార్‌పల్లి, కుల్కచర్ల పరిధిలోని ముజాయత్‌పూర్, నవాబుపేట, మర్పల్లిలో మోడల్ స్కూల్స్‌లో ఆరో తరగతి నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మోడల్ స్కూల్లో ఇంటర్ చదువుతూ పక్కనే ఉన్న హాస్టల్లో ఉంటున్నారు. అయితే, వీరికి నాలుగు నెలలుగా మెస్ బిల్లులు రాలేవు. దీంతో వార్డెన్, కేర్‌టేకర్లు పాలు, కూరగాయలు, పండ్లు, చికెన్, వాటర్ బిల్లులు చేతి నుంచి చెల్లిస్తున్నారు. కొంత మంది వడ్డీకి తీసుకువచ్చి హాస్టల్స్‌ను నెట్టుకొస్తున్నారు. చేసిన అప్పులు కుప్పలు కావడం.. కిరాణ దుకాణ యజమానులు సరుకులు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

చేవెళ్లలో వంట బంద్

చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లోని ఇంటర్ బాలికల వసతి గృహంలో వంద మంది విద్యార్థినులు ఉంటున్నారు. ఈ వసతి గృహంలో సరుకులు అయిపోవడంతో.. ఈ నెల 18 (గురువారం) వంట చేయడం మానేశారు. సంక్రాంతి సెలవులు అయిపోయి తిరిగి హాస్టల్స్‌కు వచ్చిన విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడ్డారు. తల్లిదండ్రులు హోటల్ నుంచి భోజనం తీసుకు వచ్చి తినిపించారు. మరికొందరు ఇంటి నుంచే టిఫిన్స్ పంపించారు. మోడల్ టీచర్లు హాస్టల్ విద్యార్థినులకు స్కూల్లో వండిన మధ్యాహ్నం భోజనం వడ్డించేలా చర్యలు తీసుకున్నారు.



తిరిగి ఇంటికి వెళ్తున్న ఇంటర్ విద్యార్థిని

సరుకులు లేవని ఇంటికి పంపించారు



మాది వికారాబాద్, చేవెళ్లలోని మోడల్ స్కూల్లో సీటు రావడంతో ఇక్కడే హాస్టల్లో ఉండి చదువుకుంటున్నాను. సంక్రాంతి సెలవులకు ఇంటికి వెళ్లి తిరిగి హాస్టల్‌కు లగేజీతో వచ్చాను. హాస్టల్‌లో సరుకులు లేవని తిరిగి పంపించారు. లగేజి మా నాన్న తీసుకెళ్లాడు. మధ్యాహ్న భోజనం స్కూల్లో చేశాను.

- శైలజ, బీపీసీ, ఇంటర్ ఫస్టియర్, చేవెళ్ల

ఇంటినుంచి టిఫిన్ బాక్స్ తెచ్చుకున్నా



మాది షాద్‌నగర్. ఇంటి నుంచి వచ్చేటప్పుడు మమ్మీ టిఫిన్ పంపింది. హాస్టల్‌కు వచ్చాక భోజనం లేదని తెలిసింది. ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తినేశాను. ఫ్రీ బస్సు సౌకర్యం ఉండటంతో నేను సాయంత్రం తిరిగి ఇంటికి వెళ్లాను.

- సాయిలక్ష్మి, విద్యార్థిని, చేవెళ్ల

అప్పులు చేసి భోజనం పెడుతున్నాం



అప్పులు చేసి పిల్లలకు భోజనం పెడుతున్నాం. ఇప్పటి వరకు నాలుగు నెలల మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే మా జీతాలు కూడా రాలేవు. ఇప్పటికే రూ. 45వేలు వడ్డీకి తీసుకు వచ్చాను. పాలు, చికెన్, గ్యాస్, గుడ్లు, డ్రింకింగ్ వాటర్‌కు వారంలో బిల్లులు వస్తాయని చెప్పుకుంటూ.. సరుకులు తెస్తున్నాను. ప్రస్తుతం సరుకులు ఇవ్వడం లేదు. టెండర్ దారుడు పాత బిల్లులు ఇస్తేనే కొత్తగా సరుకులు సరఫరా చేస్తామంటున్నారు. ప్రస్తుతం అరకొర సరుకులున్నాయి. పిల్లలు అందరూ వస్తే భోజనం పెట్టే పరిస్థితి లేదు. హాస్టల్ కరెంట్ బిల్లు కూడా 55 వేల వరకు పెండింగ్ ఉంది. బిల్లు కట్టకుంటే కరెంట్ కట్ చేస్తామంటున్నారు.

- విజయలక్ష్మి, కేర్‌టేకర్, చేవెళ్ల మోడల్ స్కూల్

హోటల్ నుంచి భోజనం తెచ్చి ఇచ్చాను



నా బిడ్డ ఇంటర్ చదువుతుంది. ఉదయం మోడల్ స్కూల్ వద్ద దింపి వెళ్లాను. హాస్టల్ కొనసాగడం లేదని తెల్వడంతో.. ఇక్కడే ఉండి మధ్యాహ్న భోజనం హోటల్ నుంచి తీసుకు వచ్చి ఇచ్చాను. సాయంత్రం మళ్లీ నా బిడ్డను ఇంటికి తీసుకువెళ్లాను. హాస్టల్లో సరుకులు లేవని భోజనం బంద్ పెట్టారు.

- మల్లేష్, విద్యార్థిని తండ్రి, చేగూరు, నందిగామ మండలం

వారం రోజుల్లో క్లియర్ చేస్తాం



పెండింగ్‌లో ఉన్న మెస్ బిల్లులను వారంలోగా క్లియర్ చేస్తాం. వచ్చిన బడ్జెన్‌ను అడ్జెస్ట్ చేస్తున్నాం. మోడల్ స్కూల్ హాస్టల్స్ కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నాం.

- సుశీందర్‌రావు, జిల్లా విద్యాధికారి, రంగారెడ్డి

బీఆర్ఎస్ తాండూరు నియోజకవర్గ

ఇన్‌చార్జిగా మహేందర్‌రెడ్డి?

- పార్టీ జిల్లా అధ్యక్ష పదవిని ఆశిస్తున్న మాజీ ఎమ్మెల్యే





తాండూరు, జనవరి19: నియోజకవర్గాల ఇన్‌చార్జి బాధ్యతలను బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీలకు అప్పగించనుంది. దీంతో ఆ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జిగా మాజీ మంత్రి, ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించనున్నారు. ఎమ్మెల్సీ హోదాలో ప్రొటో కాల్ పరిధిలో ఉండటం, మాజీ మంత్రిగా, ఎమ్మెల్యేగా చేసిన అనుభవంతో నియోజవర్గ పార్టీ పగ్గాలు అధిష్ఠానం అప్పగించనుంది. రెండు రోజుల్లో ఇన్‌చార్జిల నియామకం జరిగే అవకాశం ఉందని మహేందర్‌రెడ్డి ధ్రువీకరించారు. మొన్నటి వరకు తనకే ఇన్‌చార్జి బాధ్యతలు కట్టబెడుతున్నారని ప్రకటించిన మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ఆ బాధ్యతలు అప్పజెప్పకపోవడంతో పార్టీ జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ కొనసాగుతున్నారు. అయితే పార్టీ తాండూరు నియోజవర్గ ఇన్‌చార్జిగా మహేందర్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడిగా రోహిత్‌రెడ్డిల నియామకం జరిగితే మళ్లీగ్రూపు రాజకీయాలకు తెరలేచే అవకాశం ఉంది. అధిష్ఠానం దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు



మేడ్చల్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా వ్యాప్తంగా ఈనెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ గౌతమ్ తెలిపారు. లెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ నేడు, రేపు రెండురోజుల పాటు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బూత్‌లెవల్ అధికారులు ఈరెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 6, 8 ఫారాలతో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మార్పులు, చేర్పులు, సవరణలు ఇతర అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు.

ప్రమాదకరంగా యూటర్న్‌లు!

- ప్రాణాలుపోతున్నా పట్టించుకోని అధికారులు

కీసర, జనవరి19: యూటర్న్‌లు ప్రమాదకరంగా మారాయి. ప్రాణాలు పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్లక్ష్య ధోరణితో వాహనాదారులు మృత్యువుకు ఎదురెలుతున్నారు. కీసర మండలం, నాగారం మున్సిపల్ పరిధిలోని పలు ప్రాంతాలల్లో యూటర్న్‌లు పెను ప్రమాదంగా మారాయి. పట్టించుకోవాల్సిన అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారు. చీర్యాల్ చౌరస్తా నుంచి కీసరకు వచ్చే దారిలో యూటర్న్ ఉంది. ఈ యూటర్న్ ద్వారా వాహనదారులు అపశవ్య దిశగా వస్తుండంతో నిత్యం రోడ్డు ప్రమదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ఉదయం కళాశాలలు, పాఠశాలలకు, ఉద్యోగాలకు వెళ్లే వారు ఎక్కువగా ఉండటంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఇదిలా ఉండగా అపసవ్య దిశగా వాహనాదారులు యూటర్న్ ద్వారా చీర్యాల్ గ్రామానికి వెళ్తున్న సమయంలో నగరం నుంచి వాహనాలు అదుపు తప్పి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదంలో ఇటీవల ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరి కూలీల ప్రాణాలు గాల్లో కలిసిపోయాయి. దీంతో పాటు అహ్మద్‌గూడలోని రాజీవ్‌గృహకల్ప కాలనీ వెళ్లె యూటర్న్ ప్రమాదానికి నిలయమైంది. యూటర్న్ పక్కనే రోడ్డును అక్రమించి టీ స్టాల్ ఉండటంతో ట్రాఫిక్ సమస్య తెలెత్తుతోంది. వాహనాలు ఇష్టానుసారంగా పార్కింగ్ చేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదే విధంగా ప్రజాసాయి గార్డెనుకు వెళ్లే మార్గంలో యూటర్న్ వద్ద వాహనాదారులు అపసవ్య దిశలో వెళ్తుంటారు. నాగారం మున్సిపల్ పరిధిలోని ఆన్‌లిమిటెడ్, మ్యాక్స్ షోరూం ముందు ఉన్న యూటర్న్‌లు ట్రాఫిక్‌కు అంతరాయంగా మారాయి. నాగారంలో ట్రాఫిక్ సమస్య తెలెత్తుతోంది. అంతేకాకుండా రోడ్డు మొత్తం గుంతలుగుంతలు మారడంతో ప్రయాణం నరకంగా మారింది. అహ్మద్‌గూడ వద్ద మూడు యూటర్న్‌లు కాకుండా ఒకటే యూటర్న్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నాగారం, చీర్యాల్ చౌరస్తా వద్ద, ప్రమాదకరంగా మారిన యూటర్న్‌ల వద్ద ట్రాఫిక్ పోలీసులను నియమించాలని కోరుతున్నారు. రాంగ్ రూట్‌లలో వచ్చే వారికి అవగాహన కల్పించే విధంగా సూచిక బోర్డు ఏర్పాట్లు చేయాలని పలువురు కోరుతున్నారు.



చీర్యాల్ చౌరస్తాలో జరిగిన ప్రమాదం (ఫైల్)



ప్రమాదకరంగా చీర్యాల్ చౌరస్తాలోని యూటర్న్

చర్యలు తీసుకుంటాం



కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో రద్దీగా ఉండే ప్రాంతాలను, యూటర్న్‌లు ఉన్న స్థలాలను పరిశీలిస్తాం. అదే విధంగా యూటర్న్‌ల వద్ద ప్రమాదాల నివారణకు పాలకులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటాం. యూటర్న్‌ల వద్ద రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాదారులపై చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్ విభాగం అధికారులతో సమన్వయం చేసుకొని చర్యలు తీసుకుంటాం.

వెంకటయ్య, సీఐ, కీసర



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి

ప్రతిపాదనలు సిద్ధం చేయాలి

- కలెక్టర్ నారాయణరెడ్డి

కొడంగల్, జనవరి 19: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై శాఖలవారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొడంగల్ నియోజకవర్గంలో జిల్లా స్థాయి తరహాలో అభివృద్ధి పర్చేందుకు అన్నీ ప్రతిపాదనలు సిద్ధం చేసి కడా ప్రత్యేకాధికారికి సోమవారం వరకు అందించాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంలో అధికారులందరూ పూర్తి బాధ్యతతో పని చేయాలన్నారు. కొడంగల్ ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు, సింగిల్ డబుల్ రోడ్లతో పాటు జీపీ భవనాలు, కమ్యూనిటి హల్‌లు, వంతెనలు, అతిథి గృహం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణం కోసం స్థలాలను కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. . అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ, ట్రైనీ కలెక్టర్ నారాయణఅమిత్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

యువ ఓటర్లపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించాలి

వికారాబాద్ : ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా 18 నుంచి 19ఏళ్ల యువ ఓటర్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ హైదరాబాద్ నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు హాజరయ్యారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు అధిక సంఖ్యలో భాగస్వాములయ్యేలా చూడాలన్నారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ శ్రీ నారాయణరెడ్డి అన్నారు.

4ఏళ్ల తర్వాత.. ఎస్ఎంసీ ఎన్నికలు

- బడిలో మోగిన ఎన్నికల గంట
- నేడు నోటిఫికేషన్.. 29న ఎన్నికలు
- పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలకు షెడ్యూల్



వికారాబాద్, జనవరి 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలకు నగారా మోగింది. ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 20న ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసి 29న తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. ఎస్ఎంసీల పదవీ కాలం ముగిసిన నాలుగేళ్ల తరువాత ప్రభుత్వ ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో విద్యా కమిటీల ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలతో పాటు ప్రభుత్వ యాజమాన్య పరిధిలోకి వచ్చే ఎయిడెడ్, కేజీబీవీ, మోడల్, టీఎస్ గురుకుల, సంక్షేమ గురుకుల పాఠశాలలల్లోనూ యాజమాన్య కమిటీల ఎన్నికలు నిర్వహించనున్నారు. ఒకటి నుంచి ఎనిమిదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఈ ఎన్నికల్లో పాల్గొని ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులను ఎన్నుకోనున్నారు. చేతులు ఎత్తే విధానం, లేదా వాయిస్ ఓటింగ్ పద్ధతిలో ఎన్నుకుంటారు. విద్యా కమిటీ మెంబర్ కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వ్యవహరించనున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీలను 2019, నవంబరులో ఎన్నుకున్నారు. ఆ తరువాత ఆ కమిటీల పదవీ కాలాన్ని ఆరు నెలల వంతున ఇంత వరకు పొడిగిస్తూ వచ్చారు. ఎట్టకేలకు ప్రభుత్వం పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించడంతో ప్రస్తుతం కొనసాగుతున్న పాత కమిటీలు రద్దయ్యాయి.

పాఠశాలల అభివృద్ధిలో కీలక పాత్ర

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తుంటే, పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన, నిర్వహణ విషయంలో పాఠశాల యాజమాన్య కమిటీలు క్రియాశీల భూమిక పోషించనున్నాయి. ప్రతి రెండేళ్లకు ఒకసారి ఎస్ఎంసీలకు కొత్త కమిటీలను ఎన్నుకోవాల్సి ఉంటుంది. పాఠశాల నిర్వహణ, అభివృద్ధిలో ఈ కమిటీలది కీలక పాత్ర ఉండనుంది. పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికల షెడ్యూల్ విడుల కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో మరోసారి రాజకీయ వాతావరణం వేడెక్కనుంది. రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నప్పటికీ ప్రత్యక్షంగా లేదా పరోక్షంగానో ఈ ఎన్నికలపై ఆ ప్రభావం పడనుంది. ఎన్నికైన కొత్త కమిటీలు జనవరి 29వ తేదీ నుంచి కొలువుదీరనున్నాయి.

నేడే నోటిఫికేషన్ విడుదల

పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల ప్రక్రియ శనివారం ప్రారంభం కానుంది. ఈనెల 20న ఉదయం 10 గంటలకు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కొత్త యాజమాన్య కమిటీల ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. జిల్లాలో 1064 ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు ఉండగా, కేజీబీవీలు 18, మోడల్ స్కూళ్లు 9, ఎయిడెడ్ 11, టీఎస్ఆర్ఐఈఎస్ 2, యూఆర్ఎస్ 2 పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంసీ ఎన్నికల్లో పాల్గొనాలని కోరుతూ నోటీసు జారీ చేస్తారు. అదే రోజు మధ్యాహ్నం విద్యార్థుల తల్లిదండ్రుల పేర్లను పాఠశాల నోటీసు బోర్డుపైన ప్రదర్శిస్తారు. 22, 23వ తేదీల్లో ఎన్నికల్లో పాల్గొనే తల్లిదండ్రులు, సంరక్షకుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. 24న తల్లిదండ్రులు, సంరక్షకుల తుది జాబితా ప్రకటిస్తారు. 29వ తేదీ ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నిక నిర్వహిస్తారు.మధ్యాహ్నం1.30 గంటలకు సభ్యులు తమలో ఒకరిని చైర్మన్‌గా, మరొకరిని వైస్ చైర్మన్‌గా ఎన్నుకుంటారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4గంటల వరకు కొత్తగాఎన్నికయ్యే పాఠశాల యాజమాన్య కమిటీలు తొలి సమావేశం నిర్వహించి పాఠశాలకు సంబంధించిన అంశాలపై చర్చిస్తారు.

ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



ప్రభుత్వ ఆదేశాల మేరకు పాఠశాలల్లో యాజమాన్య కమిటీ ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వంజారీ చేసిన మార్గదర్శకాలు మేరకు ఎన్నికలు నిర్వహించాలి. ఎలాంటి పొరపాట్లకు చోటు కల్పించకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు కొనసాగేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలి. పాఠశాల విద్యా కమిటీల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలి.

- రేణుకాదేవి, డీఈవో, వికారాబాద్

ఆలయ భూములను కబ్జా చేస్తే చర్యలు

తాండూరు రూరల్, జనవరి 19 : మండలంలోని అంతారం పరిధి దస్తగిరిపేట్ వేంకటేశ్వరస్వామి ఆలయ భూములను ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని రాష్ట్ర దేవాదాయ శాఖ భూముల విభాగం డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్ హరితాదేవి హెచ్చరించారు. శుక్రవారం అంతారం



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద బోర్డును ఏర్పాటు చేయిస్తున్న ఎండోమెంట్ డిప్యూటీ కలెక్టర్ అనిత, తహసీల్దార్ హరితాదేవి

గ్రామ శివారులోని దస్తగిరిపేట్‌లలో వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన సర్వే నంబర్లు 50, 161, 162, 177, 179లలో మొత్తం 57ఎకరాల 29గుంటల భూమి ఉందని తెలిపారు. ఈ మేరకు గ్రామ ప్రజలకు తెలియజేసే విధంగా దేవాదాయ శాఖ రెవెన్యూ విభాగం సమక్షంలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారి అనిత మాట్లాడుతూ.. ఈ భూములు వేంకటేశ్వరస్వామి ఆలయ భూములని, వీటిని ఎవరూ ఆక్రమించొద్దని బోర్డును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ భూములపై హక్కులన్నీ ఎండోమెంట్ శాఖకే చెందుతాయన్నారు. ఇక్కడ ఆక్రమణలు, కొనుగోళ్లు, అమ్మకాలు నిషిద్ధం అన్నారు. అలాంటి ప్రయత్నాలు చేసే చట్టపరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ భూములు కబ్జా చేసినట్టు గతంలో ఫిర్యాదులందాయని, వాటిపై కొన్ని నెలల క్రితం వచ్చి క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. అధికారుల వెంట భద్రేశ్వర ఆలయ ఈవో శేఖర్‌గౌడ్, ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, గ్రామస్తులు ఆశన్న, అంబరీశ్, మొగులప్ప, టీజే.శ్రీనివాస్, రజనికాంత్, స్వామిదాస్ ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బషీరాబాద్, జనవరి 19: కాంగ్రెస్ ప్రభుత్వాల్లోనే అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కంసాన్‌పల్లి(బి), ఎక్మాయి, మంతన్‌గౌడ్, అల్లాపూర్, దామర్‌చెడ్, వాల్యానాయక్‌తండా, జమ్లానాయక్‌తండా గ్రామాల్లో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అంతకు ముందు ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేను సన్మానించారు. గ్రామ సభల్లో ఎమ్మెల్యే మట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభత్వంలో ప్రాజెక్టుల పేరిట నాయకులు అవినీతికి పాల్పడ్డారన్నారు. రూ.వేల కోట్ల ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆరోపించారు. ఎన్నో హామీలిచ్చినా ఒక్క పథకాన్నీ సక్రమంగా అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో నియోజకవర్గానికి భారీగా నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. తనకు ఓటు వేసిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఆరు గ్యారంటీలను తప్పక అమలు చేస్తామన్నారు. త్వరలో 2లక్షల ఉద్యోగాల భర్తీకి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ శాంతాబాయి, నవాంద్గి ప్యాక్స్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు జి.మాధవరెడ్డి, ఎస్.వెంకటేష్‌మహరాజ్, రోహత్‌మహరాజ్, పార్టీ అధ్యక్షుడు నర్సింహులుగౌడ్, నాయకులు లక్ష్మణ్‌రావు, రాజేందర్‌రెడ్డి, క్యాద్గిరా భీమ్, శంకర్‌నాయక్, జయరాం, సర్పంచ్‌లు నదీర్గ నారాయణ, నర్సిరెడ్డి, శివ, వార్డుమెంబర్ సిద్ధార్థ, పవాన్ పాల్గొన్నారు.



వాల్యానాయక్ తండా సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గజేందర్‌గౌడ్

భూ సమస్యలు పరిష్కరించాలి

షాబాద్, జనవరి 19 : రాష్ట్రవ్యాప్తంగా భూసమస్యలు పరిష్కారయ్యేందుకు ప్రభుత్వం వెంటనే భూముల సర్వే నిర్వహించాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని నాగర్‌గూడ సమీపంలోగల శ్రీకృష్ణ ఆలయం ప్రాంగణంలో భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గడిగె గజేందర్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవరెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి నరేందర్‌రెడ్డిలతో కలిసి జిల్లాస్థాయి రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రం భూ సమస్యలతో వేగిపోతుందని, ధరణి పోర్టల్ పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పుల వల్ల అనేక మంది రైతులు ఇబ్బందులు పడ్డారని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే భూముల సర్వే నిర్వహించి టైటిల్ గ్యారంటీ ఇవ్వాలన్నారు. కమతాల ఏకీకరణ చేస్తే 80శాతం వరకు భూసమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. షాబాద్, చేవెళ్ల, శంషాబాద్, మొయినాబాద్, శంకర్‌పల్లి, కొందుర్గు, చౌదరిగూడ, షాద్‌నగర్ మండలాల అధ్యక్షులు దండు యాదవరెడ్డి, ఆగిరెడ్డి, పెంటారెడ్డి, పాండురంగం, చంద్రమౌళి, జంగయ్య, రాంచంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.



మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా కార్మిక సదస్సులో మాట్లాడుతున్న పి.జంగారెడ్డి

'కార్పొరేట్ల'కు కొమ్ము కాస్తున్న కేంద్రం

కందుకూరు జనవరి 19 : మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని, కార్పొరేట్ సంస్థలకు కొమ్ము కాస్తోందని రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.జంగారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని పాషానరహరి భవనంలో ఆ పార్టీ నాయకుడు దుబ్బాక రాంచందర్ ఆధ్యక్షతన కార్మిక, కర్షక జిల్లా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జంగారెడ్డి హాజరై మాట్లాడుతూ కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలు లేకుండా చేస్తోందన్నారు. 4 లేబర్ కోడ్‌ల బిల్లుతో కార్మికరంగం కుదేలైపోయి కార్మికులు రోడ్డున పడే పరిస్థితులున్నాయని, రిలయన్స్ కంపెనీకి ప్రధాని కొమ్ము కాస్తున్నారని విమర్శించారు. సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు, ఎన్.రాజు, ఎం.చంద్రమోహన్, నాయకులు మధుసూదన్ రెడ్డి, అంజయ్య, కె.జగన్, జగదీష్, కిషన్, సీహెచ్ జంగయ్య, కుమార్, శేఖర్, కృష్ణ, బ్రహ్మయ్య, ఎ.కుమార్, కురుమయ్య, మునలయ్య, శేఖర్ రెడ్డి, బాషయ్య, స్వప్న, పాల్గొన్నారు.



ఫిరంగి నాలాలో నిలిచిన మురుగు, చెత్తాచెదారం

వ్యర్థాలతో నిండుకున్న ఫిరంగి నాలా

» దుర్వాసనతో ప్రజల ఇబ్బందులు

శంషాబాద్, జనవరి 19: మునిసిపల్ కేంద్రంలో బస్తీల మధ్య ఉన్న ఫిరంగినాలా వ్యర్థాలతో నిండిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దాంతో ఆయా బస్తీల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మధురానగర్, రంగారెడ్డి-భుజంగరెడ్డినగర్, మిషన్‌కాంపౌండ్, సాతంరాయి తదితర ప్రాంతల్లో ఫిరంగినాలా విస్తరించి ఉంది. ఈ నాలాలో కొన్ని చోట్ల మురుగునీరు నిండిపోవడంతో పందులు, కుక్కలు ఆవాసముంటున్నాయి. సాయంత్రమైతే కాలువలోని దోమలు ఇళ్లలోకి రావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మునిపల్ అధికారులు కాలువలో కొన్నిచోట్ల పూడిక తీయించగా, మరికొన్ని చోట్ల పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. దాంతో ఇటీవల కురిసిన వర్షాలకు వరద నీరంతా కాల్వలో చేరడంతో పూర్తిగా మురుగు నీరు చేరి దుర్గంధం ఎక్కువైంది. మునిపల్ కార్యవర్గం చర్యలు తీసుకొని ఫిరంగినాలాలోని మురుగు నీటిని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని బస్తీవాసులు కోరుతున్నారు.

నేడు, రేపు కిసాన్ మహోత్సవం

మేడ్చల్ టౌన్, జనవరి 19 : ఏరువాక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే రెండు రోజులు కిసాన్ మహోత్సవాలు శనివారం నుంచి ప్రారంభం అవుతాయని శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. గుండ్లపోచంపల్లి పరిధి మైసమ్మగూడ మల్లారెడ్డి స్కూల్‌ఆఫ్ అగ్రికల్చర్ సైన్స్ కాలేజీలో ఈ మహోత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఐకార్ క్రీడా మాజీ డైరెక్టర్ బి.వెంకటేశ్వరులు, మల్లారెడ్డి యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ వీ.ఎస్.కే.రెడ్డి, రిజిస్ట్రార్ ఎం.అంజనేయులు, అగ్రికల్చర్ స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఎ.రాజిరెడ్డి పాల్గొంటారన్నారు. వ్యవసాయరంగంలో ప్రత్యేక సేవలందించిన వారికి అవార్డులు ప్రదానం చేస్తారని, వ్యవసాయ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు శాస్త్రవేత్తలతో ఇష్టాగోష్ఠి నిర్వహిస్తునట్లు నిర్వాహకులు వివరించారు.

కొట్టుకున్న కాంగ్రెస్ నాయకులు

» ఇరువర్గాల ఘర్షణ » అదుపు చేసిన పోలీసులు

బషీరాబాద్, జనవరి 19: మండలంలోని ఎక్మాయిలో శుక్రవారం కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి కొట్లాడుకున్నారు. దీంతో అక్కడున్న పోలీసులు వారిని చెదరగొట్టి అదుపు చేశారు. కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎక్మాయికి వచ్చారు. ఎమ్మెల్యే ముఖ్య శ్రేణులతో కలిసి సభలో కూర్చున్నారు. ఎన్నికల్లో ఎమ్మెల్యే గెలుపునకు తామే కృషిచేశామని యువ నాయకులు కొందరు సభలో పెత్తనంచేస్తూ సీనియర్లను పట్టించుకోలేదు. దీంతో నాయకుల మధ్య అధిపత్య పోరు ముదిరింది. ఎమ్మెల్యే తన ప్రసంగాన్ని ముగించి వెళ్లిపోయారు. అనంతరం గ్రామ నాయకులు ఒక్కసారిగా అరుచుకుంటూ ఇరువర్గాలుగా వీడిపోయి కొట్టుకున్నారు. సీనియర్ నాయకుడు నారా గోపాల్‌రెడ్డి చొక్కా చినిగిపోయింది. దీంతో ఆయన అనుచరులు రెచ్చిపోయారు. పోలీసులు అప్రమత్తమై నాయకులను చెదరగొట్టే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. కొందరు నాయకులు పోలీసులపైకి సైతం లేచారు. పోలీసులు గొడవ మరింత పెద్దగ కాకుండా ఇరువర్గాలకు సర్దిచెప్పారు. త్వరలోనే రెండు వర్గాల నాయకులను పిలిపించి మట్లాడతానని ఎమ్మెల్యే చెప్పినట్లు ఓ నాయకుడు పేర్కొన్నారు.



కాంగ్రెస్ నాయకులను చెదరగొడుతున్న పోలీసులు

పార్లమెంట్ ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

చేవెళ్ల, జనవరి 19 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు, ఈవీఎంలను భద్రపరిచేందుకు స్ట్రాంగ్‌రూమ్‌ల వంటి సదుపాయాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కె.శశాంక తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని గొల్లపల్లి గ్రామంలో గల బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలను అధికారులతో కలిసి సందర్శించారు. అన్ని గదులను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న చేవెళ్ల, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మహేశ్వరం, పరిగి, వికారాబాద్, తాండూర్‌లో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తోందన్నారు. కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూమ్‌లు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను ఈఆర్‌వో, సంబంధిత అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. దాంతో పాటు కళాశాల భవన సముదాయానికి సంబంధించిన బ్లూప్రింట్(మ్యాప్)ను పరిశీలించారు. కౌటింగ్ ప్రక్రియ సాఫీగా నిర్వహించేందుకు బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాల అనుకూలంగా ఉంటుందా? లేదా? అనే విషయాలపై సమగ్రంగా పరిశీలన జరపాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చేవెళ్ల ఆర్డీవో సాయిరాం, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు ఉన్నారు.



బండారు శ్రీనివాస్ ఇంజనీరింగ్ కళాశాలలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

భూ ఆక్రమణకు పాల్పడిన నిందితులకు ఏడాది జైలు

యాచారం, జనవరి 19 : పట్టాభూమిని ఆక్రమించిన ముగ్గురు నిందితులకు ఏడాది జైలుశిక్షతో పాటు, ఒక్కొక్కరికి రూ. 500 జరిమానా విధిస్తూ ఇబ్రహీంపట్నం 16వ మెట్రోపాలిటన్ న్యాయమూర్తి హిమబిందు శుక్రవారం తీర్పునిచ్చారు. కోర్టు మున్షి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం యాచారం మండలంలోని బొల్లిగుట్టతండాలోని సర్వే నెంబర్ 360లో 4 ఎకరాల 23 గుంటల భూమిని ఎల్‌బీ నగర్‌కు చెందిన అనసూయ, జనార్ధన్ రెడ్డి దంపతులు కొనుగోలు చేశారు. ఈ భూమిని బొల్లిగుట్ట తండాకు చెందిన మాన్‌సింగ్ కౌలు చేస్తున్నాడు. కాగా చాంద్రాయణగుట్టకు చెందిన ఎండీ బషీర్, నజీర్, జాహంద్‌లు ఈభూమిపై కన్నేసి భూ ఆక్రమణకు పాల్పడి గోడ కట్టారు. తమ భూమిని ఆక్రమించడం సరికాదని బాధితులు నచ్చ చెప్పినా నిందితులు వినిపించుకోలేదు. దాంతో జనార్ధన్ రెడ్డి, అనసూయ దంపతులు యాచారం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు కేసు నమోదు చేసి రెవెన్యూ రికార్డులను పరిశీలించి పూర్తి వివరాలను కోర్టుకు సమర్పించారు. న్యాయమూర్తి హిమబిందు వివరాలను పరిశీలించి భూ ఆక్రమణకు పాల్పడిన ఎండీ బషీర్, నజీర్, జాహంద్‌లకు ఏడాది చొప్పున జైలు శిక్షతో పాటు రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.



చేవెళ్లలోని బస్‌స్టేషన్‌లో ఎయిడ్స్, హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలి

రంగారెడ్డి అర్బన్/చేవెళ్ల, జనవరి 19 : ప్రతీ ఒక్కరు హెచ్‌ఐవీ, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని ఓఆర్‌డబ్ల్యూ ఎం.గీత, నీరజ తెలిపారు. ఎయిడ్స్ నివారణ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్లలోని బస్‌స్టేషన్, శంకర్‌పల్లి చౌరస్తాలో పల్లె సందులవారి కళా ప్రదర్శనతో ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, రక్షణ లేకుండా సెక్స్‌లో పాల్గొనడం, హెచ్‌ఐవీ ఉన్న వారికి వాడిన సూదులు, సిరంజీలను ఇతరులకు వాడటం, హెచ్‌ఐవీ సోకిన వారి రక్తాన్ని మరొకరికి ఎక్కించడం వల్ల హెచ్‌ఐవీ సోకుతుందని తెలిపారు. హెచ్‌ఐవీ ఉన్న తల్లుల నుంచి పిల్లలకు, బిడ్డ కడుపులో ఉన్నప్పుడు, కాన్పు సమయంలో లేదా తల్లిపాల ద్వారా బిడ్డకు సోకవచ్చని తెలిపారు. సుఖవ్యాధులు ఉన్నవారికి హెచ్‌ఐవీ సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. హెచ్‌ఐవీ బారిన పడకుండా కండోమ్ ఉపయోగించాలని, సుఖవ్యాధులు రాకుండా చూసుకోవాలని, హెచ్‌ఐవీ పరీక్షలు, కౌన్సిలింగ్ చేయించుకోవాలని తెలిపారు. శృంగారంలో కండోమ్ తప్పనిసరిగా వినియోగించాలని, కండోమ్ చిరిగినా, జారినా, లీక్ అయినా హెచ్‌ఐవీ సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. ప్రతీఒక్కరు హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోవాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. పీఈలు విజయ, లత, సుహాసిని, కళాజాత బృందం సభ్యులు ఎం. శంకర్, పి. గణేష్, వి. ఎల్లయ్య, స్వప్న, సంపతయ్య, పాల్గొన్నారు.

పాములకే ప్రాణభిక్ష

» 200కి పైగా పాములను పట్టుకున్న ప్రదీప్‌కుమార్

» చంపకుండా అటవీ ప్రాంతంలో వదిలి పెట్టిన వైనం

బషీరాబాద్, జనవరి 19 : పాములంటే ప్రతి ఒక్కరికీ పుట్టెడు భయం.. పాము పేరు విన్న, చూసినా ఒక్కసారిగా పరుగులు తీస్తాము.. కొందరైతే పాము కనబడితే చాలు ప్రాణ భయంతో వెంటాడి కర్రలతో కొట్టి చంపుతారు... కానీ ఓ వ్యక్తి పాము ఎక్కడైనా ఉందని చెబితే వాటికి హాని కలగకుండా చాకచక్యంగా పట్టుకుని డబ్బాలో బంధించి అడవుల్లో వదులుతాడు. ఇప్పటివరకు 200కు పైగా పలు రకాల పాములను పట్టుకుని అడవుల్లో, జన సంచారం లేని ప్రదేశాల్లో వదిలి పెట్టి వాటికి ప్రాణబిక్ష పెడుతున్నాడు.



కొండచిలువను మెడలో వేసుకుని చూపిస్తూ ప్రజల్లో భయం పోగొడుతున్న ప్రదీప్‌కుమార్

బషీరాబాద్ మండల కేంద్రానికి చెందిన ఎం. ప్రదీప్‌కుమార్ హోటల్ నడుపుతుంటాడు.తన చిన్ననాటి నుంచి పాములంటే ఆయనకు భయం లేదు. పదోతరగతి చదువుతున్నప్పుడూ ఎక్కడైనా పాము కనిపిస్తే చాలు ధైర్యంగా వాటిని పట్టుకునే ప్రయత్నం చేసేవాడు. అప్పట్లో ప్రదీప్ తనదైన శైలిలో పాములను పట్టేందుకు మెలకువలు ప్రదర్శించడం చూసి స్నేహితులు పొగడ్తలతో ముంచెత్తేవారు. ఎక్కడైనా ఇళ్లలో పాములు చొరబడితే వెంటాడి కొట్టి చంపడం చూసేవాడు. పాపం వాటిని ఎందుకు కొట్టి చంపాలి అంటూ మధనపడేవాడు. అప్పట్లో స్థానికంగా ఒకరి ఇంట్లో నాగుపాము కనిపించి బుసకొట్టడంతో ఇంటిల్లిపాది భయంతో బయటకు పరుగులు తీశారు. ఈ విషయం తెలుసుకున్న ప్రదీప్ అక్కడికి వెళ్లి నాగుపామును కర్ర సాయంతో చాకచక్యంగా పట్టుకుని ఎలాంటి హాని కలగనీయకుండా ప్లాస్టిక్ డబ్బాలో బంధించి ఊరి బయట వదిలిపెట్టి వచ్చాడు.

ఈ క్రమంలో బషీరాబాద్‌తో పాటు పరిసార గ్రామాలు, కర్ణాటక సరిహద్దు ప్రాంత గ్రామాల్లో ఎక్కడైనా జనావాసాల్లో పాములు ఉంటే ప్రదీప్‌కు ఫోన్ చేస్తుంటారు. వెంటనే అక్కడికి చేరుకుని పామును పట్టి డబ్బాలో బంధించి అడవుల్లో వదిలిపెడతాడు. గత 30 ఏళ్లకు పైగా పాములను ఎవరూ చంపనీయకుండా పట్టుకుని అడవుల్లో వదిలి పెడుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

ఎన్నో జీవరాశుల్లో పాము ఒకటి

భూ ప్రపంచంలో ఎన్నో జీవరాశులు బతుకుతున్నాయి. వీటిలో ప్రాణహాని కలిగించే అనేక జీవరాశులతో పాములు కూడా ఒకటిగా జీవిస్తున్నాయి. ప్రాణహాని ఉందని చంపుకుంటూ పోతే ఏవీ మిగలవు. ఎక్కడైనా పాములు నివాస ప్రాంతల్లో కనిపిస్తే భయపడొద్దు. అటవీశాఖ అధికారులకు తెలియజేస్తే పట్టుకెళ్లి అడవుల్లో వదులుతారు. పాములు ఎవరిని పగబట్టవు. పాములను చూసి భయపడి మనమంతా ఎలా పరుగు తీస్తామో... అవి కూడా అంతే భయంతో పరుగు తీస్తుంటాయి. నివాస ప్రాంతాలు, ఇళ్లలో పాములున్నాయని తెలిస్తే పిలువకున్నా అక్కడికి వెళ్లి వాటిని పట్టుకుని ఊరి దూరంగా వదిలిపెడుతుంటాను.

ఔత్సాహిక విద్యార్థులకు విదేశీ విద్యనందించేందుకు కృషి

» సంస్కృతి ఇంజనీరింగ్ టెక్నాలజీ కళాశాల డైరెక్టర్ డాక్టర్. ఎం రమాకాంత్‌రెడ్డి

ఘట్‌కేసర్, జనవరి 19 : ఔత్సాహిక విద్యార్థులకు విదేశీ విద్యనందించేందుకు సంస్కృతి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల కృషి చేస్తుందని ఆ విద్యా సంస్థ డైరెక్టర్ డాక్టర్. ఎం రమాకాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో అమెరికాకు చెందిన ఓరెగాన్ యూనివర్సిటీ మార్కెటింగ్, రిక్రూట్‌మెంట్ మేనేజర్ టేలర్ నస్బానమ్‌తో కలిసి వాల్మీకి ఫారెన్ ఎడ్యుకేషన్ సంస్థ భాగస్వామ్యంతో ఓవర్సీస్ ఎడ్యుకేషన్ కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు విదేశాల్లో విద్యావకాశాలు, ప్రవేశం పొందటంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రమాకాంత్‌రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి ఫారెన్ ఎడ్యుకేషన్ సంస్థ ఇప్పటి వరకు లక్ష మంది విద్యార్థులకు ఓవర్సీస్ విద్యపై అవగాహన కల్పించిందని, సుమారు 400యూనివర్సిటీల్లో 30వేల మందికి ఆయా యూనివర్సిటీల్లో ప్రవేశం కల్పించినట్లు తెలిపారు. 20రాష్ట్రాల్లో 1200కిపైగా ప్రతినిధులతో బలమైన ఎజంట్ నెట్ వర్క్‌ను కలిగి ఉందన్నారు. విద్యార్థులకు నమ్మశక్యమైన విద్యా సంస్థల్లో చేరికతో పాటు స్కాలర్ షిప్ అందజేయటం, మెరిట్ ఆధారంగా సీట్లు లభింపచేయటంలో వాల్మీకి ఫారెన్ ఎడ్యుకేషన్ సంస్థ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్స్‌పాల్ ఉదయ్‌కిరణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నీలం సింగ్, విద్యార్థులు, తదితరులుపాల్గొన్నారు.



మాట్లాడుతున్న అమెరికాకు చెందిన ఓరెగాన్ యూనివర్సిటీ మార్కెటింగ్, రిక్రూట్‌మెంట్ మేనేజర్ టేలర్ నస్బానమ్

సేవ చేయడంలో విశ్వసనీయత ఉండాలి

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు



మాట్లాడుతున్న రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు

శామీర్‌పేట, జనవరి 19 : విద్యార్థులు విద్యను పూర్తి చేసిన తరువాత సేవ చేయడంలో, విధులను నిర్వర్తించడంలో విశ్వసనీయతను సంపాదించుకుంటూ, స్ఫూర్తిగా నిలుస్తూ అభివృద్ధి చెందాలని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ డాక్టర్ సుబ్బారావు అన్నారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా శామీర్‌పేట లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్(ఐపీఈ) కళాశాలలో అధ్యక్షుడు మాధవరావు ఆధ్వర్యంలో స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ సుబ్బారావు విచ్చేసి కళాశాల అధ్యక్షుడు మాధవరావు, డైరెక్టర్ శ్రీనివాసమూర్తిలతో కలిసి పీజీడీఎం విద్యను పూర్తి చేసిన 443 మంది విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ పనిపట్ల మక్కువ, ఏ పని చేసినా అభిరుచితో చేస్తూ గొప్ప ఫలితాలను సాధించాలన్నారు. ఆయన ఆర్‌బీఐలో పనిచేసిన అనుభవాలను ప్రస్తావిస్తూ విధుల నిర్వహణలో అట్టడుగు స్థాయి వాటాదారులకు అనుసంధానం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఏదైన ముఖ్యమనుకుంటే దానికోసం అధిక సమయాన్ని కేటాయించాలని ఆయన చెప్పారు. నేర్చుకోవడమనేది జీవితకాల ప్రక్రియ అని, పరస్పర చర్యలు పరిశీలనల ద్వారా నేర్చుకోవడం ఎంతో ఉత్తమమని సూచించారు. కళాశాల అధ్యక్షుడు మాధవరావు స్వాగతోపన్యాసం చేశారు. కళాశాల డైరెక్టర్ శ్రీనివాసమూర్తి సంస్థ చరిత్ర, వైభవాన్ని వివరించారు. కాగా ఈ స్నాతకోత్సవంలో ఐపీఈ కళాశాలలో 2023లో పీజీడీఎం కోర్సును పూర్తి చేసిన విద్యార్థి ఎ.అదిత్య కు ఉజ్వల్ ముద్దన మెమోరియల్ గోల్డ్‌మెడల్ అవార్డును ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్‌లు ప్రొఫెసర్ శ్రీకాంత్, ప్రొఫెసర్ లక్ష్మీకుమారి, ప్రొఫెసర్ ఎంఎల్ఎన్ రావు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

కొడంగల్ బైపాస్ రోడ్డు భూసేకరణకు చర్యలు

కొడంగల్, జనవరి 19: మహబూబ్‌నగర్-చించోలి హైవే రోడ్డు నిర్మాణంలో భాగంగా కొడంగల్ బైపాస్ రోడ్డుకు భూసేకరణకు అధికారులు చర్యలు చేపట్టారు. శుక్రవారం కొడంగల్‌లోని క్యాంప్ కార్యాలయంలో ఆర్డీవో, తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్ రైతులతో సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్-చించోలికి హైవే కొడంగల్ సమీపంలోని పెట్రోల్ బంక్ వద్ద బైపాస్‌తో మురారి ఫంక్షన్ హాలు పక్క నుంచి తాండూర్ రోడ్డుకు అనుసంధానం కానుందన్నారు. ఇందుకు అవసరమయ్యే భూముల సేకరణకు రైతులతో సమీక్షించారు. రైతులకు ప్రభుత్వం ఇచ్చే పరిహారంపై వివరించారు. కొడంగల్ అభివృద్ధికి నిర్మిస్తున్న బైపాస్ రోడ్డుకు రైతులు సహకరించాలని కోరారు. సమావేశంలో రెవెన్యూ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడికి సన్మానం

దోమ, జనవరి 19: వికారాబాద్ జిల్లా బీజేపీ నూతన అధ్యక్షుడిగా నియామకం అయిన సదానందరెడ్డిని శుక్రవారం అయినాపూర్ గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బుగ్గయ్య, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు గుడ్ల రాజు, ఆనంద్‌కుమార్, శ్రీనివాస్, బొంపల్లి నర్సిములు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

కులకచర్ల, జనవరి 19: చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి తండా, పురసంపల్లి గ్రామాల్లో శుక్రవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్రప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అర్హులైన గ్రామీణ ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను చేరవేసే విధంగా అవగాహన కల్పించామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు వెంకటయ్య, ఉమ్లా, ఎంపీటీసీ బ్రహ్మానందరెడ్డి, రాములు, ఎంపీహెచ్‌వో ఈవో, పంచాయతీ కార్యదర్శులు గురునాథ్‌రెడ్డి, నవీన్‌కుమార్, ఏఎన్ఎంలు పుష్పలత, ఇందిర, అశ్వినినాయక్, ఆశా కార్యకర్తలు రాజేశ్వరి, నర్సింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య విగ్రహ ప్రతిష్ఠ చరిత్రాత్మకం

» ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చందు

దోమ, జనవరి 19: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన చరిత్రాత్మక ఘట్టమని, దాన్ని వీక్షించేందుకు దేశ, విదేశాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని ముదిరాజ్ సంఘం మండల ప్రధాన కార్యదర్శి చందు అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 22న కొన్ని రాష్ట్రాలు సెలవు ప్రకటించాయని, తెలంగాణలో కూడా సెలవు ప్రకటించాలన్నారు. ఆ రోజు జీవహింస జరగకుండా చూడాలని చెప్పారు.

ప్రపంచ స్థాయి కరాటే పోటీలకు 150 మంది క్రీడాకారుల ఎంపిక

పరిగి, జనవరి 19: ట్రెడిషనల్ జపాన్ షోటోకాన్ స్పోర్ట్స్ కరాటే అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ నెల 24న నగరంలో నిర్వహిస్తున్న ప్రపంచ నఖయామ షోటకాన్ పోటీలో జిల్లా నుంచి 150 మంది కరాటే ఆటగాళ్ళు హాజరవుతున్నారు. దీనికి సంబంధించి జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి పోస్టర్లను విడుదల చేయించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు జె.శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లా నుంచి ఈ సారి ఎక్కువ సంఖ్యలో హాజరువుతున్నట్లు తెలిపారు. ప్రపంప స్థాయి పోటీలో పాల్గొని మంచి ప్రతిభను కనబరిచి జిల్లా పేరుప్రతిష్ఠలు తీసుకువస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు ఎం.బ్రహ్మచారి, ఎం.శ్రీనివాస్, బి.వెంకటయ్యలు పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఎస్పీ, కరాటే మాస్టర్లు

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్/పరిగి, జనవరి 19: వికారాబాద్‌లో గల మైనార్టీ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో 2024-25 సంవత్సరానికి ప్రవేశానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని గురుకులం ప్రిన్సిపాల్ రత్లావత్ పకీర శుక్రవారం తెలిపారు. 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరానికి ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు దరఖాస్తులను ఆహ్వానించామన్నారు. ఈ నెల 18 నుంచి ఫిబ్రవరి 6 వరకు మైనారిటీ గురుకుల బాలుర పాఠశాల/కళాశాలలో దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు వివరాల కోసం 9959746436 అనే నంబర్లో సంప్రదించాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సైతం చేసుకోవచ్చున్నారు. పరిగి బాలుర మైనార్టీ రెసిడెన్షియల్ ప్రిన్సిపాల్ ఎం.తావుర్యానాయక్ మాట్లాడుతూ పాఠశాల/కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో అడ్మిషన్లకు ఫిబ్రవరి ఆరులోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ముస్లిం, క్రిస్టియన్, జైన్, సిక్కులతో పాటు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓసీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాలకు 9010984174/ 9652555841/ 9676927579 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.



రక్తమైసమ్మకు బోనాలు

తాండూరు రూరల్, జనవరి 19: పర్వతాపూర్‌లో శుక్రవారం రక్తమైసమ్మతల్లికి బోనాల కార్యక్రమాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. స్థానికులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం డప్పువాయిద్యాల మధ్యన మహిళలు బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. బోనాలతో ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. పాడి పంటలను చల్లగా చూడాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని గ్రామస్థులు వేడుకున్నారు. సర్పంచ్ లాల్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

కొడంగల్, జనవరి 19: ప్రత్యేక ఓటు నమోదు కార్యక్రమాన్ని 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని కొడంగల్ నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, వికారాబాద్ అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 1 జనవరి 2024 నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదయ్యేందుకు శని, ఆదివారాలు రెండు రోజులు ప్రత్యేక కార్యక్రమాన్ని అన్ని పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్నట్టు చెప్పారు. పాత ఓటర్లు ఏవైనా మార్పులు, చేర్పులుంటే ఫారం-8 నింపి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇందుకు అన్ని పోలింగ్ కేంద్రాల్లో బీఎల్వోలు అందుబాటులో ఉంటారని చెప్పారు.



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



మాట్లాడుతున్న తాండూరు ఆర్డీవో శ్రీనివాస్‌రావు

18ఏళ్లు నిండిన వారు ఓటరుగా నమోదవ్వాలి

తాండూరు రూరల్: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీవో శ్రీనివాసరావు సూచించారు. నేడు, రేపు నియోజకవర్గంలోని 269పోలింగ్ కేంద్రాల్లో క్యాంప్‌లు ఉంటాయన్నారు. బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని, ఓటరు నమోదు, తప్పులు, చిరునామా మార్పులు, డబుల్ ఓటర్ల తొలగింపు, చనిపోయిన వారి పేర్ల తొలగింపునకు దరఖాస్తులు స్వీకరిస్తారని, ఉచితంగానే ఫామ్‌లు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలి



మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ప్రభాకర్

బంట్వారం జనవరి 19 : అధికారులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి వాటిని త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని బంట్వారం ఎంపీపీ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్‌లో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. ఏ గ్రామంలోనైనా ఎలాంటి ప్రజాసమస్యలున్నా తమ దృష్టికి తెస్తే అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామన్నారు. రొంపల్లి ఎంపీటీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ, ఆర్‌అండ్‌బీ రోడ్లు పూర్తిగా పాడయ్యాయని, గుంతల్లో పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. సమావేశానికి అన్ని శాఖల అధికారులు వస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వచ్చే సమావేశానికి అయినా అన్ని శాఖల అధికారులు పాల్గొనాలన్నారు. మీటింగ్‌లో లేవనెత్తిన సమస్య లేవీ పరిష్కారం కావడం లేదని ఎంపీటీసీలు, సర్పంచ్ లు మండిపడ్డారు. కార్యక్రమంలో అధికారులు సుశీల్‌కుమార్ షిండే, ప్రవీణ్‌కుమార్, ప్యాక్స్ ఛైర్మన్ రాంచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పంచాయతీ రికార్డుల తనిఖీ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 19 :కొర్రెముల పంచాయతీని జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి సందర్శించి రికార్డులను తనిఖీచేశారు. పంచాయతీకి సంబంధించిన ఆదాయ వ్యయాలపై కార్యదర్శి కవితను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఆక్రమ నిర్మాణాలు ఏమైనా జరుగుతున్నాయా? ఇళ్ల అనుమతులు ఎలా ఇస్తున్నారనే విషయాలపై అరా తీశారు. అక్రమనిర్మాణాలు జరుగకుండా చూడాలని కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ నిర్వహణను సజావుగా సాగించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు.



కొర్రెముల పంచాయతీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డీపీవో రమణ మూర్తి

ప్రతీ మండల కేంద్రంలో అంతర్జాతీయ

ప్రమాణాలతో పాఠశాలలు



మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్లో ఆన్‌లైన్ అడ్మిషన్ ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు, జనవరి 19: తాండూరు నియోజకవర్గంలోని అన్ని గురుకులాలను బలోపేతం చేసి ప్రతీ మండలంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పాఠశాలలను ఏర్పాటుకు ప్రభుత్వం కృషిచేస్తుందని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరులో మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్లకు రిజిస్ట్రేషన్ ప్రక్రియను శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ప్రభుత్వ గురుకుల పాఠశాలలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో బడి, గుడి లేని గ్రామం ఉండకూడదని ముఖ్యమంత్రి ఉద్దేశ్యం అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం విద్యకు మొదటి ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగయ్య, కౌన్సిలర్ ప్రభాకర్‌గౌడ్, జిలానీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తున్న అధికారులు,నాయకులు

కొడంగల్, జనవరి 19: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు.శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అధికారి కె.వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, ఎంపీపీ ముద్దప్ప, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంత్, మాజీ సర్పంచ్ సంజీవ రెడ్డి, నాయకులు రాములు చెక్కులను అందజేశారు. ప్రభుత్వం పేదింటి ఆడపడుచుల పెళ్లికి ఆర్థికసాయం చేయడం హర్షణీయం అని నాయకులన్నారు.

ఇసుక వేలంతో రూ.60,500 ఆదాయం



మహంతీపూర్‌లో ఇసుకను వేలం వేస్తున్న పోలీసులు, అధికారులు

బొంరాస్‌పేట్, జనవరి 19: మహంతీపూర్‌లో పట్టుబడిన ఇసుకను రెవెన్యూ, పోలీసు అధికారులు శుక్రవారం వేలం వేశారు. 20 ట్రాక్టర్ల ఇసుకను వేలం వేయగా ప్రభుత్వానికి రూ.60,500 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. ఎస్సై శంకర్, సిబ్బంది, రెవెన్యూ అధికారులు రవి, గ్రామస్థులతో కలిసి వేలం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తే సీజ్ చేసి చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన



సైబర్ క్రైమ్‌ల గురించి విద్యార్థులకు వివరిస్తున్న అడ్మిన్ ఎస్ఐ అశోక్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 19 : సైబర్ నేరాల పట్ల పోలీసులు అవగాహన కల్పించారు. ఘట్‌కేసర్‌లోని పుడమి పాఠశాల విద్యార్థులకు శుక్రవారం అడ్మిన్ ఎస్ఐ అశోక్ సైబర్ నేరాలతో కలిగే నష్టాలపై వివరించారు. అపరిచితులకు వ్యక్తిగత విషయాలను, ఫోన్ నెంబర్లు, సోషల్ మీడియా అకౌంట్లు చెప్పొద్దన్నారు. అలాంటి వారితో వాట్సప్, ఇన్‌స్టా, స్నాప్‌చాట్లలో చాటింగ్ చేయొద్దన్నారు. క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, టీచర్లకు పేరుప్రతిష్ఠలు తీసుకురావాలని కోరారు.

పన్నులు సకాలంలో చెల్లించాలి



గుండ్లపోచంపల్లి కమిషనర్ రాములు

మేడ్చల్ టౌన్, జనవరి 19 : మున్సిపల్ పరిధిలోని ఇళ్ల యజమానులు బాధ్యతాయుతంగా తమ ఇంటి వార్షిక పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించాలని గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు కోరారు. ఈ సంవత్సరం వంద శాతం వార్షిక ఇంటి పన్నులు వసూలు చేయటానికి సిబ్బందిని రంగంలోకి దింపామన్నారు. మొండి బకాయిల వసూళ్లకు కఠినచర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే ఇంటి సామాన్లను జప్తు చేయడానికి కూడా వెనకాడబోమన్నారు. పన్ను చెల్లింపుదారులు తమ వెబ్‌సైట్‌కి వెళ్లి ఆన్‌లైన్‌లోనూ చెల్లించవచ్చన్నారు. మున్సిపల్ సిబ్బంది వార్డుల్లో తిరిగి ఇంటి పన్ను వసూలు చేస్తారన్నారు. అలాగే వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యూవల్ చేసుకోవాలన్నారు. పన్ను చెల్లించేవారు మున్సిపల్ కార్యాలయానికి వచ్చి చెల్లించొచ్చన్నారు. పన్ను వసూళ్లకు కౌన్సిలర్లు సిబ్బందికి సహాయసహకారాలు అందించాలని కమిషనర్ రాములు కోరారు.

పథకాలను వినియోగించుకోవాలి



కొడంగల్ రూరల్, జనవరి 19 : ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని హస్నాబాద్ సర్పంచ్ బి.పకీరప్ప అన్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన లక్ష్మికి కల్యాణ లక్ష్మి చెక్కును కడా అధికారి కె.వెంకట్‌రెడ్డి చేతుల మీదుగా కొడంగల్‌లో అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కొడంగల్: 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న 'కడ' అధికారి, నాయకులు



ఎదులాబాద్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, టీచర్లు

కొడంగల్, జనవరి 19: జాతీయ భావాలు కలిగిన తపస్ ఉపాధ్యాయ సంఘం ఉపాధ్యాయుల సమస్యలను త్వరితగతిన పరిష్కరింపజేసేలా కృషిచేస్తుందని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు అన్నారు. 2024 సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం కొడంగల్‌లోని క్యాంప్ కార్యాలయంలో కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ అధికారి కె.వెంకట్‌రెడ్డి, సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు సుంకరి వెంకటయ్య ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులను త్వరితగతిన పూర్తిచేసి బదిలీలు చేపట్టాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు మల్లయ్య, బాల్‌రాజ్, కె.నారాయణ, క్రాంతికుమార్, పృథ్వీసింగ్, కృష్ణయ్య, సి.రమేశ్, బాకారం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

బొంరాస్‌పేట: టీఎస్‌యూటీఎఫ్ 2024 క్యాలెండర్లను ఎమ్మార్సీలో ఎంఈవో రాంరెడ్డి, సంఘ నాయకులు ఆవిష్కరించారు. టీచర్లు శ్రీహరిలాల్, శ్రీహరిరెడ్డి, పాపిరెడ్డి, అనితఠాకూర్, వెంకటేశం,సేవ్య, శ్రీప్రియ, నిరీక్షణ,కరుణాకర్, వినయ్, వెంకట్, మల్లేశ్, రాజశేఖర్, లక్ష్మి, అలివేలు, నాగజ్యోతి, నరేందర్, కలీమొద్దీన్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైంది

ఘట్‌కేసర్ రూరల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎదులాబాద్ జెడ్పీ పాఠశాలలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయుఎస్) 2024 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సూచించారు. ఉపాధ్యాయులు ఐక్యంగా తమ హక్కులను సాధించుకోవాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో టీపీయూఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, హెచ్ఎం రాములు, పీఈటీ తిరుమల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

దౌల్తాబాద్: పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ఎమ్మార్సీలో నూతన సంవత్సరం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండల అధ్యక్షుడు భీమప్ప మాట్లాడుతూ.. నిరంతరం విద్యారంగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సి.విజయ్‌కుమార్, నాయకుడు పెంట్యానాయక్, హెచ్ఎంలు ఉషన్న, రాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్‌లో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తపస్, యూటీఎఫ్ నాయకులు



దౌల్తాబాద్: క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పీఆర్టీయూ నాయకులు

క్రైం కార్నర్

అనుమానంతో మహిళ హత్య

- కేసును పక్కదోవ పట్టించేందుకు నిందితుడి కుట్ర
- 48గంటల్లో ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ కోటిరెడ్డి



మహిళ హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కోటిరెడ్డి



అనసూయ (ఫైల్)

వికారాబాద్, జనవరి 19: ఈ నెల 15న వికారాబాద్ మండలం పులుమద్ది సమీపంలో వెలుగుచూసిన మహిళ హత్య కేసును పోలీసులు 40గంటల్లో ఛేదించారు. మృతురాలు రంగారెడ్డి జిల్లా చేవెళ్లకు చెందిన అనసూయ(35)గా గుర్తించారు. శుక్రవారం వికారాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు వివరాలను ఎస్పీ కోటిరెడ్డి విలేకరులకు వెల్లడించారు. ధారూరు మండలం రాజాపూర్‌నకు చెందిన తలారి బాబు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు సమీపంలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. చేవెళ్లకు చెందిన ఎర్రోళ్ల అనసూయకు ఐదేళ్ల క్రితం భర్త చనిపోయాడు. ఆమెకు బాబుతో పరిచయం ఏర్పడి మూడునాలుగేళ్లుగా వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు. అనసూయ అవసరాలకు బాబు పలు సందర్భాల్లో డబ్బు ఇచ్చాడు. ఆ డబ్బులను తిరిగి అడగడంతో ఆమె బాబును దూరం పెట్టింది. దీంతో అనసూయ వేరే వ్యక్తితో సంబంధాన్ని నెరుపుతోందనే అనుమానంతో అనసూయను చంపాలని బాబు పథకం పన్నాడు. ఈ నెల 14న అనసూయను నమ్మించి వికారాబాద్‌కు తోలుకొచ్చి మద్యం కొన్నాడు. పులుమద్ది సమీపంలోకి వచ్చి ఇద్దరూ మద్యం తాగారు. మద్యం మత్తులో బాబు ఆమెతో గొడవపడ్డాడు. ఆమె ముఖంపై గుద్ది తర్వాత చీర కొంగుతో ఉరేసి చంపాడు. మృతదేహాన్ని పక్కనే ఉన్న కాలువలోకి తీసుకెళ్లి డెడ్ బాడీని ఎవరూ గుర్తుపట్టకుండా ఉండేందుకు అనసూయ ముఖంపై చీరకప్పి నిప్పంటించాడు. 15న అటుగా వెళ్తున్న పులుమద్ది వాసులు మహిళ మృతదేహాన్ని చూసి సర్పంచ్ మాధవరెడ్డికి తెలిపారు. ఆయన పోలీసులకు సమాచారం ఇవ్వగా పోలీసులు చేరుకుని విచారణ చేపట్టారు. ఈ నెల 17న చేవెళ్లలో అనసూయ మిస్సింగ్ కేసు నమోదవడంతో వికారాబాద్ పోలీసులు వెళ్లి పరిశీలించి హతురాలు అనసూయగా గుర్తించారు. ఆమె ఇంటికి వెళ్లి విచారించారు. బాబుతో అనసూయ సంబంధం పెట్టుకుందని చెప్పడంతో పోలీసులు బాబు కోసం గాలించారు. 18న రాత్రి బాబును అతడి ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని విచారించారు. అతడు నేరాన్ని ఒప్పుకున్నాడని ఎస్పీ తెలిపారు. బాబుపై 2016లో వికారాబాద్ స్టేషన్‌లోనే ఓ హత్య కేసు నమోదైందని తెలిపారు. అనసూయ ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలు తీసుకుని వాటి కోసం దొంగలే హత్య చేశారు అన్నట్టుగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడని ఎస్పీ తెలిపారు. అనసూయ హత్య చేసిన బాబుపై ఐపీసీ 302, 379, 201 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని ఎస్పీ వివరించారు. 48 గంటల్లో కేసును ఛేదించిన ఏఎస్పీ రవీందర్, డీఎస్పీ నర్సింహులు, సీఐలు శ్రీను, ఆంజనేయులు, ఎస్ఐలు సంతోష్, అనిత, భరత్ భూషణ్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

బైక్-కారు ఢీ.. ముగ్గురికి గాయాలు

పరిగి, జనవరి 19 : కారు, బైక్ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన శుక్రవారం జాఫర్‌పల్లి శివారులో జరిగింది. పూడూరు మండలం పుడుగుర్తికి చెందిన బింగి రవీందర్, అతడి భార్య, కుమారుడితో కలిసి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన కారు వారిని ఢీకొంది. రవీందర్, భార్య వాణి, ఐదేళ్ల కొడుకు శివకర్‌లకు గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చికిత్స పొందుతున్న బాలుడు

మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి ఒక రోజు జైలు

తాండూరు, జనవరి 19: మద్యం తాగి వాహనం నడిపిన ఓ వ్యక్తికి ఒక రోజు జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జ్యూడీషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ నామాల అశోక్ శుక్రవారం తీర్పు చెప్పారు. మంబాపూర్‌నకు చెందిన రవీందర్ మద్యం తాగి వాహనం నడపగా మెజిస్ట్రేట్ ఈ మేరకు శిక్ష ఖరారు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

కీసర రూరల్, జనవరి 19: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠాను శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపిన వివరాల ప్రకారం.. బియ్యాన్ని మహారాష్ట్ర తరలిస్తున్న లారీని ఔటర్ రింగ్ రోడ్డు పట్టుకున్నారు. 36టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకొని షేక్ రవూఫ్, మతిన్, సయ్యద్ తురబ్, అమోల్ వాగ్మొరెలను అదుపులోకి తీసుకున్నారు. మిగతా ముఠా సభ్యులు పరారీలో ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గ్రామ పంచాయతీల్లో వంద శాతం

ట్యాక్సులు వసూలు చేయాలి



వీరొశెట్టిపల్లిలో ఇంటి పన్ను చెల్లిస్తున్న సర్పంచ్ బిడె నాగప్ప

తాండూరు రూరల్, జనవరి 19 : మండల పరిధిలోని వీరొశెట్టిపల్లి, గోనూరు, నారాయణపూర్ గ్రామాల్లో మండల పంచాయతీ అధికారి రతన్‌సింగ్ పర్యటించి పలు రికార్డులను పరిశీలించారు. పారిశుధ్య పనులతోపాటు పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ఆయా పంచాయతీల్లో పన్నులను వందశాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. వీరొశెట్టిపల్లిలో సర్పంచ్ బిడె నాగప్ప తన ఇంటి పన్ను పంచాయతీ అధికారి సమక్షంలోనే కార్యదర్శి శ్రుతికి అందజేసి రశీదు తీసుకున్నారు. పారిశుధ్య పనులను పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ఆయా కార్యదర్శులను ఆదేశించారు. ఆయన వెంట పీఎస్‌లు సత్యనారాయణరెడ్డి, రషీద్‌పాషా ఉన్నారు.

బొంరాస్‌పేట్ అంతర్గత రోడ్లకు మహర్దశ



బొంరాస్‌పేట్‌లో సీసీ రోడ్ల కోసం పరిశీలిస్తున్న పీఆర్ అధికారులు

బొంరాస్‌పేట్, జనవరి 19: బొంరాస్‌పేట్‌లో అంతర్గత సీసీ రోడ్లకు మహర్దశ పట్టనుంది. రోడ్లు, డ్రైనేజీల పనులు ముమ్మరం కానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే రేవంత్‌రెడ్డి సీఎంగా కావడంతో పట్టణంలో అధికారులు శుక్రవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పీఆర్ డీఈ నాగేశ్వరచారి సమక్షంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, హైమాస్ట్ లైట్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం, ట్రాన్స్‌ఫార్మర్లకు నివేదికలు తయారు చేశారు. పీఆర్ ఏఈ రవికిరణ్, కాంగ్రెస్ నాయకులు నర్సిములుగౌడ్, రాంచంద్రారెడ్డి, గ్రామస్తులు వీరేశలింగం, కిష్టప్ప, లక్ష్మణ్, ఉమాపతి, కాశప్ప ఉన్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన

ఐనాపూర్ యువకులు



భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఐనాపూర్ వాసులు

పరిగి, జనవరి 19: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను ఐనాపూర్ గ్రామ యువకులు శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో కలిశారు. గ్రామ యువజన సంఘం ప్రతినిధి భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో భట్టికి పుష్పగుచ్ఛం అందజేశారు. పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి సహకారంతో గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు విడుదల చేయాలని కోరగా, డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. విక్రమార్కను కలిసిన వారిలో గ్రామ యువకులు ఇ.రవికుమార్, నల్ల సాయిలు, బోయిని రఘు, జి.భీమయ్య,పి.రాజులు ఉన్నారు.

ఓటరు నమోదు కార్యక్రమాన్ని

సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట్, జనవరి 19: ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా శని, ఆదివారం రెండు రోజుల పాటు మోమిన్‌పేట్ మండలంలో నిర్వహించే ప్రత్యేక ఓటరు కార్యక్రమాన్ని 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మనోహరచక్రవర్తి అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరూ ఓటర్లుగా నమోదవ్వాలని, పోలింగ్ కేంద్రాల్లో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఓటరు జాబితాకు ఈ నెల 22 వరకు దరఖాస్తులు స్వీకరించి ఫిబ్రవరి 2 వరకు పరిశీలించి 8న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ రాజు, సీనియర్ అసిస్టెంట్ సుధ, జూనియర్ అసిస్టెంట్లు జగన్, అలివేలు, మహేశ్, సునీత, మౌనిక, పంచాయతీ కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, నర్సింలు, వెంకటయ్య, మాధవి, సుగుణ, విక్రంరెడ్డి, ప్రవీణ్‌కుమార్, జగన్మోహన్‌రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ మనోహర చక్రవర్తి

'దళితబంధు ప్రొసీడింగ్ ఇచ్చిన వారందరికీ నిధులు విడుదల చేయాలి'

యాలాల, జనవరి 19: దళితబంధుకు దరఖాస్తు చేసుకొని ప్రొసీడింగ్, ఐడీ కార్డులు ఇచ్చిన వారికి దళితబంధు నిధులను విడుదల చేయాలని సీపీఎం మండల మండల ప్రధాన కార్యదర్శి బుగ్గప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం ముందు వద్ద నిరసన తెలిపారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందచేశారు. ఆయన మాట్లాడుతూ.. దళితబంధు పథకం కోసం 5నెలల క్రితం అనేత మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలో ఎంపికైన వారందరికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రొసీడింగ్‌లు ఇబ్బందన్నారు. ఎంపికైన వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు క్రిష్ణ, రమేష్, నర్సిములు, మహేష్, మల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 19: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి సబిత అన్నారు. శుక్రవారం భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు చెల్లించాలని కార్మికులతో కలిసి ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. 5నెలలుగా భోజన కార్మికులకు బిల్లులు చెల్లించలేదన్నారు. బిల్లులు రాక భోజన కార్మికులు అప్పులతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతున్నా భోజన కార్మికులు విద్యార్థులకు వంటచేసి పెట్టారని తెలిపారు. కార్మికులకు వెంటనే పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో భోజన కార్మికులు పుష్ప, శ్రీనివాస్, ప్రేమలత, భాగ్య, కవిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

- **వికారాబాద్:** మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వికారాబాద్ జిల్లాలో విలీనమైన నాలుగు మండలాలకు సంబంధించిన ప్రభుత్వ, స్థానిక సంస్థల ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాల బదిలీ పూర్తి స్థాయిలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, ఎండీ షఫీ జడ్పీ సీఈవో జానకిరెడ్డికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం వారు జడ్పీ సీఈవోను కలిసి జిల్లాలో కొనసాగుతున్న కొడంగల్ నియోజకవర్గ పరిధి మండలాల్లోని ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాల వివరాలను మహబూబ్‌నగర్ జడ్పీ నుంచి త్వరగా తెప్పించుకోవాలని వారు కోరారు. అనంతరం వారు డీఈవో రేణుకా దేవిని కలిసి 2022, మే నెలలో జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణకు హాజరైన వారికి ఈఎల్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జడ్పీ సీఈవో, డీఈవోలకు వారు ఎస్‌టీయూ టీఎస్ డైరీ, క్యాలెండర్ అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.
- **వికారాబాద్:** వరల్డ్ నకాయామ షూటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న హైదరాబాద్‌లో జరగనున్న సెకెండ్ ఇంటర్నేషనల్ ఇన్విటేషనల్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2024 పోటీల వాల్ పోస్టర్‌ను జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి ఆవిష్కరించారు. టోర్నమెంట్ అధికారిక రెఫరీ జె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా నుంచి 150మంది బాల బాలికలు మార్షల్ ఆర్ట్స్ పోటీలకు హాజరు కావడం సంతోషంగా ఉందన్నారు. పోటీల్లో తమ ప్రతిభ కనబరిచి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాస్టర్లు బ్రహ్మం, శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.
- **ధారూరు:** మండలంలోని ప్రతి పోలింగ్ కేంద్రంలో నూతన ఓటర్ల నమోదు కోసం ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని తహసీల్దార్ భువనేశ్వర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆడ పిల్లలను బతకనిద్దాం.. చదువనిద్దాం

మేడ్చల్ జనవరి 19(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆడ పిల్లలను బతకనిద్దా-చదువనిద్దామని జిల్లా మహిళా శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ అధికారి ఎం.కృష్ణారెడ్డి అన్నారు. శామీర్‌పేట మండలం బొమ్మరాశిపేట పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఆడపిల్లలను 'బతకనిద్దాం.. చదువనిద్దాం' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయించారు. అయన మాట్లాడుతూ.. బాల్య వివాహాల చట్టం, పోక్సో యాక్ట్, లింగ సమానత్వంపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. సమాజంలో విద్యతోనే సమానత్వం వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, టీచర్లు, విద్యార్థినులు